


# ధన్యవాదం

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

సినిమా ముగిసేసరికి బయట పెద్ద వర్షం పడుతోంది.

ఆనందరావు లాబీలో నిలబడి ఇంటికి ఎలాగ చేరడమా అని ఆలోచనలో పడ్డాడు. నైట్ షోకి వచ్చినవాళ్లూ, ఈవినింగ్ షోనుంచి బయటికి వొచ్చిన వాళ్లూ అందరూ లాబీలో ఉన్నారు. ఒకరినొకరు తోసుకుంటున్నారు. ఆనందరావుకి చికాకుగా ఉంది; ఊపిరి సలపడం లేదు. బస్‌స్టాండుకి వెళ్లే ప్రయత్నం చేస్తే అక్కడికి చేరేలోగా తడిసిపోతాడు. టేక్సీగాని ఆటోగాని దొరకనూదొరకదు, దొరికినా దానికి డబ్బుపెట్టుకునే శక్తి తనకి లేదు. పేరుకి బేంకులో పని చేస్తున్నా, అతనేం ఆఫీసరు కాదు, టాక్సీల్లో తిరగటానికి. వీటన్నిటికీ తోడు అతనికి తలనొప్పిలాగ ఉంది. తన సీటు తెరకి ఆరో వరుసలో ఉండడాన్న అయి ఉంటుంది. అంతకన్న పై క్లాసుకి వెళ్లడం అతని బడ్జెట్‌కి తగినపనికాదు. ఆకలిగా ఉంది. త్వరగా వెళ్లకపోతే అక్కడ హోటలు కట్టేస్తారు. అయిదు నిమిషాలకే అతనికి, గంటసేపు నిలబడ్డట్టు ఉంది.

"ఆనంద్."

చక్కటి గొంతుక అమ్మాయిది.

చుట్టూ చూద్దామనుకుని ఆగిపోయాడు. అంత తియ్యటి పిలుపు తనకోసం అయి ఉండదు. తనని ఆనంద్ అని కాలేజీలో ఒకరిద్దరు పిలిచేవారు. అంతే.

"ఆనంద్! నేను– మమతని...." అన్న మాటలతోబాటు అతని భుజంమీద గాజుల గలగలతో చెయ్యి పడ్డాక అతను వెనుదిరిగాడు.

"నువ్వా మమతా!" అన్నాడు పొడి గొంతుకతో. ఆమెని చూడగానే గొంతుక ఎండిపోయింది.

"నేనే ఆనంద్!.... బాగున్నారా?.... మంచి పరధ్యానంగా ఉన్నారు. అందుకని తట్టిపిలిస్తేగాని మీరు పలకనేలేదు" అంది మమత చిరునవ్వుతో. ఆ జన సమ్మర్దంలోకూడా ఆమె వెలిగిపోతోంది. ఆమెకీ అతనికీ మధ్య నిలబడ్డ మనిషి తప్పుకున్నాడు.

"సారీ! నీ పిలుపు వినపడలేదు" అన్నాడు ఆనందరావు.

"డోంట్ మైండ్! సినిమాకి వొచ్చారా?" అంది నవ్వుతూనే. ఇంకా

తలుపులు తియ్యలేదు.

"లేదు.. ఈవినింగ్ షో చూశావ—వెడదామంటే వర్షం.. నీ—అదే—మీరు?" అన్నాడు.

"నేనూ అంతే—కొత్తగా నన్ను మన్నించనక్కరలేదులేండి...." అంది మమత బయటికి చూస్తూ. "నాకు తడవడం అంటే సరదా— అయినా భయంగా ఉంది. కారు కొంచెం వెనక్కి వుంది. ఫరవాలేదు. మీ రెలాగ వెడుతున్నారు?" అంది.

"బస్...."

"ఈ వర్షంలో ఎలాగ వెడతారు? పదండి నేను డ్రాప్‌చేస్తాను...." అని, ఆమె చరచర మెట్లుదిగి నడవసాగింది. ఆ వానలో ఆమె వెన్నెట్లో నడుస్తోన్న పూలమొక్కలాగ ఉంది.

క్షణం సందేహించి అతనూ ఆమె వెనకాల నడిచాడు. అతనికి తడవడం అంటే భయం. అదీకాక పేంటు తడిసి బురదపడితే మళ్ళీ వాష్‌చేయించుకోవాలి. కానీ, వెళ్ళకపోతే మమతదగ్గర పరువు పోతుంది. లిఫ్టు దొరకదు.

గేట్‌కీపర్ కాటోలు—కాదు. ఎవరో పెద్దమనిషి—మమతకి గొడుగుపట్టి తడవకుండా తీసుకెళుతున్నాడు. ఆమె కారు తాళం తీసి తలుపు తెరిచి నవ్వుతూ అతనికి థాంక్స్ చెప్పింది.—అదే మహాభాగ్యం అనుకున్నంత ఆనందంగా ఆ పెద్దమనిషి ముఖం వెలిగింది. తడుస్తూ కారుకి అటు నిల్చున్నాడు ఆనందరావు. చలికి వణుకు పుట్టేస్తోంది. ఆమె తలుపు తెరిచి అతన్ని లోపలికి రానిచ్చింది. గట్టిగా తలుపువేసి 'అమ్మయ్య' అనుకున్నాడు.

ఎంతో జాగ్రత్తగా నేర్పుగా కారు బయటికి తీసి మౌంట్ రోడ్‌లోకి తెచ్చింది మమత. "మీయిల్లెక్కడ?" అంది.

"మైలాపూర్‌లో—కాని, నన్ను బస్ స్టాండులో వదిలేస్తే చాలు" అన్నాడు ఆనందరావు.

"ఫరవాలేదు .. నేను అటునుంచి వెడతాను.... మైలాపూర్‌లో ఎక్కడ?"

"సంస్కృతం కాలేజీ దగ్గర. నువ్వెక్కడ ఉండడం?"

"అడయార్‌లో—" అని కొంచెం దూరం వెళ్లేక "పెళ్లి అయిందా? పిల్లలు ?" అంది మమత.

"ఒకటోది—లేదు. రెండోది...."

"చాలు.... బోధపడింది"అంది మమత నవ్వుతూ. ఈ వర్షంలో, అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్‌లో కారు నడుపుతూకూడా ఆమె చిరునవ్వుతోనే ఉంది. ఆరోజుల్లో తాను ఎమ్.ఏ.లోనూ, ఆమె బి.ఎస్‌సీ. లోనూ ఉన్నప్పుడు గంభీరంగా ఉండేది ఎప్పుడైనా తనతో ఉన్నప్పుడు తప్ప... అప్పుడు ఇంత చక్కగానూ ఉండేది కాదు. తెల్లగా, అందంగా ఉన్నా, ఈ గులాబీరంగూ, నునుపుతేరిన అందమూ, ఈ హుందా, ఆమెలో లేదు. అప్పుడు కళ్లుచెదిరేపాటి సౌందర్యం ఆమెది. ఇప్పుడు కళ్లూ, మనసూ చెదిరే అందం. గొంతుక కూడా అప్పటికన్నా తియ్యగా ఉంది.

"నీకు....పిల్లలా ?"

మళ్లీ నవ్వింది మమత. "ఉన్నారు. ఇద్దరు."

"నిజంగా ?" అన్నాడు అతను. మూడేళ్ల కిందట పెళ్లికాని పిల్ల—అంతకన్నా అందంగా, విచ్చుకొంటున్న గులాబిలాగ ఉన్న ఈమెకి ఇద్దరు పిల్లలా? "ఇద్దరు పసివాళ్లతో ........ కష్టంగాలేదూ ?" అన్నాడు.

నవ్వుతూనే, "వాళ్లు పసివాళ్లు కాదు ఆనంద్. పెద్దవాడు కిరణ్‌కి పదేళ్లు. శ్రీకి ఎనిమిదేళ్లు" అంది మమత.

"అంటే—రెండోపెళ్లివాడా ఆయన!" అన్నాడు ఆనంద్.

ఆమె చిరునవ్వు చెక్కుచెదరలేదు. "కాదు" అంది.

"మరి ?"

"మూడోపెళ్లి. కిరణ్ మొదటిభార్య కొడుకు. శ్రీ రెండోభార్య కూతురు."

"నీకు—లేరన్నమాట."

"వాళ్లిద్దరూ ఉన్నారుగా !"

మమత తన భుజంమీద చెయ్యివేసి పలకరించడం జ్ఞాపకం వొచ్చింది ఆనందరావుకి. ఆమె తనని మరిచిపోలేదు.... అంతేకాదు....

"నీ పిల్లలు కాదుగా !" అన్నాడు. అతని గొంతుక కొంచెం తేలికపడింది.

ఆమె నవ్వి, "వాళ్లలాగ అనుకోరు. నేనూ అనుకోను" అంది. ఇంక ఆ విషయం గురించి మాట్లాడడానికి ఇష్టం లేనట్టు, మాటమారుస్తూ, "మీరింకా ఎందుకు పెళ్లిచేసుకోలేదు ?" అంది.

ఏమని చెప్తాడు ?

అప్పుడు వాళ్లు పాతికవేలరూపాయిల కట్నం ఇస్తామని వొచ్చేరు. ఆ వారంలోనే బేంకు క్లర్కుపోస్టు వొచ్చింది తనకి. మమత తల్లిదండ్రులు పాతిక రూపాయిలుకూడా ఇవ్వలేరు.... అందుకని, ఆమెని కాదన్నాడు. చాలా బాధగానే కాదన్నాడు. "నిన్నుమరిచిపోలేను మమతా ! నా ప్రాణానికి నువ్వు ప్రాణానివి. కాని, ఏంచెయ్యను ? అమ్మా నాన్నా పట్టుపడుతున్నారు. వాళ్లు ఎన్ని త్యాగాలుచేసి నన్ను చదివించారో నాకు తెలుసు'ను. కాదనలేకపోతున్నాను. నన్ను క్షమించు. కాని, మరిచిపోకు.... నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను" అన్నాడు గద్గదంగా. ఆ తరువాత మమత ఏమీ అనలేదు. ఒక్కసారి కన్నీళ్లు తుడుచుకుని, "నాకర్థమైందిలెండి. మీరు బాధపడకండి ఆనంద్ ! జీవితంలో అన్నీ మనం అనుకున్నట్టు అవవు... " అంది. తనకి గొప్ప రిలీఫ్ కలిగింది. అమ్మచెప్పినట్టు అందం తింటమా ఏమిటి? సిరివొస్తోంటే కాదనడం మహాపాపం. అయినా ఆ

అమ్మాయికి మాత్రం ఏమిటి తక్కువ? ....పెళ్లి చూపుల్లో లక్ష్మీదేవిలాగ కనిపించింది. ఆనందం దాచుకునే ప్రయత్నంలో ఎంతో బాధపడుతూ వెళ్లిపోయాడు మూడేళ్ల కిందట.

ఆ మరుసటివారం, నిశ్చయతాంబూలాలు పుచ్చుకునే రోజుకి ముందరిరోజు లక్ష్మీదేవికి మరో 'మంచి' సంబంధం వొచ్చింది. అతను డాక్టరు. ఆనందరావు కన్నా బాగుంటాడు. ఆస్తిపరుడు. ఒక్క చెల్లెలు....ఆమెకి పెళ్లి అయిపోయింది. మరి ఆనందరావుకి పెళ్లికాని ముగ్గురు చెల్లెళ్లు... వాళ్లు ఓ ఉత్తరంరాసి చేతులు దులుపుకున్నారు. అదంతా ఇవ్వాళ మమతతో ఎలాగ చెప్పడం?

"నా పెళ్లి.... నేను పెళ్లిచేసుకోక పోడానికి చాలా కారణాలు ఉన్నాయి, మమతా! అదిగి నన్ను బాధపెట్టకు— పాత జ్ఞాపకాలు తిరగదోడడం అంటే చాలా బాధ నాకు" అన్నాడు ఆనందరావు.

"అవును—ఇదీ నిజమే.... సరేగాని, కాఫీ తాగిపోదామా?" అంది మమత.

"నీ ఇష్టం" అన్నాడు ఆనందరావు. వొద్దని చెప్తే మరో నాలుగైదు నిమిషాల్లో ఆమె తనని వొదిలివెళ్లిపోతుంది. సరే సంకే—తనకి ఐదో పదో ఖర్చు.

ఒక ఫైవ్‌స్టార్ హోటల్లోకి దారితీసింది మమత. లాబీముందు కారు ఆపి, దిగివెళ్లింది. అతనామెని అనుసరించేడు. ఇక్కడ ఒక్క కప్ కాఫీ ఖరీదు లేదు తన జేబులో. కాని, పలాయనం చెయ్యలేదు....

రెస్టారెంట్‌లో ఇద్దరు ఆమెకి టేబిల్ చూపి, కూర్చోబెట్టేరు. అతనికి కొంత మర్యాద దొరికింది.

ఆమె ఆర్డర్ చేసింది. మూడునాలుగు అయిటమ్స్....ఐస్‌క్రీమ్.... ఆనందరావు మాట్లాడకుండా మెనూ పుస్తకంలో ఆవిడ ఆర్డర్‌చేసినవాటి ధరలు చూసి మొత్తం కడుతున్నాడు. అరవై రూపాయలు దాటేక ఇంక లెక్కలు ఆపి గ్లాసులో నీళ్లు చప్పరించేడు.

"ఏమిటి అంత సీరియస్?" అంది మమత.

"ఏమీలేదు మమతా! ఇన్నాళ్ల తరువాత నిన్ను చూస్తే, అదీ ఇలా డ్రెమెటిక్‌గా కలుసుకుని చూస్తుంటే నాకేదో కలలాగ ఉంది." అన్నాడు.

"అవును— నాకూ అలాగే అనిపించింది ఆనంద్! మరుపురాని తేదీ ఇవేళ నాకు" అంది.

"నాకూను" అన్నాడు ఆనందరావు.

"మీకు జ్ఞాపకం ఉందా?" అంది మమత ఆశ్చర్యంగా. మసకవెలుతురులో ఆమె మరీ అందంగా కనిపించింది. ఆమె ఆ ప్రశ్న అడుగుతోన్నప్పుడు కళ్లు పెద్దవిచేసింది. వాటిలోకి కొత్త కాంతి వొచ్చింది.

"నిన్ను మళ్లీ కలిశాను మమతా! అంతకన్న జ్ఞాపకం ఏం కావాలి?" అన్నాడు, రొమాంటిక్‌గా, ఆనందరావు.

ఆమె కళ్లలో వెలుగు మాయం ఐపోయింది. ఇదే తారీకున మూడు సంవత్సరాలకిందట ఆనందరావు ఆమెని విచిత్రంగా కలిసి తన మనోవేదన వెళ్లబోసుకున్నాడు. ఆమె దుఃఖంతో కన్నీరుపెట్టిన చివరిరోజు అది.

బేరర్స్ ఆర్డర్ చేసినవన్నీ తెచ్చేరు. అతనికి చాలా ఆకలిగా ఉంది. మధ్యాహ్నం తాగిన కాఫీ... రూములో ఏమీ ఉండదు. ఈ వర్షానికి హోటల్లో ఏమీ ఉండకుండా అయిపోవొచ్చును. టేబిల్ మీద అయిటమ్స్ అన్నీ వేడిగా, రుచిగా, అతి శుభ్రంగా ఉన్నాయి. చీజ్‌రోల్స్, ఆనియన్ బజ్జీ....ఐస్‌క్రీమ్ ... చాలా బావున్నాయి, మమతలాగ.

ఆమె పేరుకి ఒక బజ్జీ కొరికి, లైమ్‌జ్యూస్ చప్పరిస్తోంది. అన్నీ తినడం ముగించి, "నువ్వేమీ తినలేదు మమతా!" అన్నాడు, కాఫీ తాగుతూ.


"పెళ్లి భోజనం చెయ్యాలి!" అంది మమత.

"నాకోసం ఇన్ని ఎందుకని?" అన్నాడు. బేరర్ బిల్ తెచ్చాడు. కాఫీ తాగడంలో నిమగ్నమైపోయి అతను బిల్‌వేపు చూడలేదు. బిల్ ఒక ప్లాస్టిక్ ఫోల్డర్లో పెట్టి తెచ్చేడు బేరర్. ఆమె తన బేగ్‌లోంచి చిన్న కార్డుతీసి, బిల్ మీద పడేసి, సంతకంచేసి, ఒక నోటు—బహుశా పదిరూపాయలు, దానిలో పెట్టడం మాత్రం అతను గమనించాడు.

రెండు నిమిషాల తరువాత అతనూ, ఆమె, బయటికి వచ్చారు. వర్షం కొంత తగ్గింది. ఆమె కారుతెచ్చి పోర్టికోలో పెట్టేరు.

"నే నివ్వవలసిన బిల్—నువ్వివ్వడం నాకు బాగాలేదు" అన్నాడు కారులో కూర్చుంటూ, ఆనందరావు.


"నా సెల్రబేషన్ కదా! అయినా ఎవరిస్తే ఏముంది!" అంది మమత. ఆ మాటల్లో అతనికి తియ్యటి సంగీతం వినిపించింది. మనలో మనం అన్నభావం



3



1



2

కలిగింది. వినిపించే సంగీతం కన్న వినిపించని స్వరాల్లోనే మాధుర్యం ఎక్కువ.

సాంస్క్రిట్ కాలేజి దగ్గర అతన్ని డ్రాప్‌చేసి, "ఒకసారి మాఇంటికి రండి? ఇదిగో మా అడ్రస్" అంటూ మమత కార్డు తీసిఇచ్చింది. అతను జేబులో పెట్టుకున్నాడు. "నాకు రావాలనీ, నిన్ను చూడాలనీ ఉంది మమతా !.........నేను వొస్తే నీకు ఇబ్బంది కలగదు కదా !" అన్నాడు ఆనందరావు.

"నో. నో. తప్పకుండా రండి ! మిమ్మల్ని ఇవేళ ఇలా కలియడం నాకు చాలా సంతోషంగా ఉంది. గుడ్ నైట్" అని చెప్పి, చిరునవ్వుతో అతనికి వీడ్కోలు చెప్పి సాగిపోయింది మమత.

అక్కడినించి అరకిలోమీటరు నడవాలి. ఇంకా చిన్న చినుకులు పడుతూనే ఉన్నాయి.హాయిగా కారులో కూర్చున్నాక ఇది మరీ కష్టంగా ఉంది. ఇంటిదాకా ఆమెని రమ్మనడం అతనికి ఇష్టంలేక పోయింది. ఆ ఇరుకురోడ్డు పెంటా పెంటవాసన. అలాటి చోట తానుంటున్నాని ఆమెకి తెలియనక్కరలేదు.

"ఏం ఆనందరావు! ఆవిడని చూసి కళ్లు జిగేల్ మన్నాయా, నేను కనబడనేలేదు?' అంటూ పలకరించాడు. రూమ్మేటు సత్యమూర్తి

"నువ్విక్కడ ఎందుకున్నావు?" అన్నాడు ఆనందరావు కొంచెం కంగారుగా. "ఏమీ లేదు- మన హోటల్ వాడి అత్తగారు పరమపదించిదట- సంతాపసూచకంగా ఈ సాయంత్రము హోటలు కట్టేశాడు. పద- టజ్‌లోకి వెళ్ళి ఎక్కడైనా తిందాం" అన్నారు సత్యమూర్తి,

"వద్దు- నా కాకలిగా లేదు" అన్నాడు ఆనందరావు.

"ఎలా ఉంటుంది ? అలాటి మెరుపు తీగని చూస్తే చాలు-నువ్వేమో ఆవిడతో కార్లో కూడా తిరిగి వొచ్చావాయె" అన్నాడు సత్యమూర్తి.

ఆనందరావు మాట్లాడలేదు.

"గొప్పఅమ్మాయి బ్రదర్? మా కెప్పుడూ- సూచనకైనా చెప్పలేదు? అంత అందం, డబ్బూ ఉన్న పిల్ల. గొప్ప ఛాన్సు కొట్టేశావు కదా! పద నాకు కంపెనీ అయినా ఇయ్యి ఒంటరిగాపోయి రావాలి" అన్నాడు సత్యమూర్తి.

"సారీ రూముకి వెడతాను."

నిష్టూర్చి, "నిజమే నే! అలాటి కంపెనీ తరువాత నా కంపెనీ దేనితరవాత మరి దేనిలాగనో ఉంటుంది. సరే- పో నేను తిని వస్తాను. అప్పుడు వివరంగా చెప్పుదువు గాని" అని సత్యమూర్తి వెళ్ళిపోయాడు.

ఆనందరావు రూముకి చేరి బట్టలు మార్చుకుని కేంప్‌కాట్ మీద పడుకున్నాడు. ఫ్యాన్ తిరుగుతున్నా అతన్ని దోమలు కుడుతున్నాయి. కాని అలవాటు కనుక, అది పట్టించుకోలేదతను. మమతని సాయంత్రం కలిసిన దగ్గరనించీ జరిగిన ప్రతీ క్షణాన్నీ అతను గుర్తు తెచ్చుకున్నాడు.


ఒక సంవత్సరం తన గర్ల్‌ఫ్రెండ్ మమత.

టైము దొరికి అవకాశం ఉన్నప్పుడల్లా ఆమె, తాను కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. ఏ చెట్టు కిందో కూర్చుని తియ్యగా ఆమెతో గడిపిన గంటలు నిముషాలలాగగడిచిపోయేవి. ఆమె చాలా రిజర్వ్‌డ్‌గా ఉండేది, తనతో తప్ప. ఎప్పుడైనా పొరపాటుకి మాత్రంవొచ్చేది. ఆమెచేతులు, చెంపలు, తాకితే ఎంతో తియ్యటి అనుభూతి వొచ్చేది. ఆమె కూడ అలాటి క్షణాలని ఎంజాయ్ చేసేది. ఒకటి రెండు సార్లు ఆమె మాటల్లో ఆనంద్ మీద తనకి ఉన్న అభిమానం సూచించింది. "నువ్వే నాదానివి మమతా!" అని అతను చెప్పినప్పుడల్లా ఆమె చక్కటి పెద్ద కళ్లలో మెరుపూ, నున్నటి బుగ్గల్లో ఎరుపు వొచ్చేవి.


అంతకన్న తనకి చనవు ఇచ్చేది కాదు. తన నరాలు యమయాతన పెట్టేవి, ఒక్కొక్కరోజు మరీధ్యాసా ఉండేది కాదు. అందుకే తన చదువు పాడయింది. చచ్చి మూడవ తరగతిలో పాస్‌అయినాడు. ఆమెమాత్రం చలించేది కాదు. చివరికి ఫస్ట్ క్లాస్‌లోపాసయింది.

తను ప్రేమించినంతగా ఆమె తనని ప్రేమించలేదని, మంచము మీద పడుకొని నల్లటి చూరుని పరిశీలిస్తూ ఆనందరావు గతంలోకి వెళ్లి ప్రస్తుతపు ఆలోచనలో పడ్డాడు. తనమీద పూర్తి నమ్మిక ఉంటే, ఆమె తనకి పూర్తిగా దగ్గర అయి ఉండాల్సింది.


తరవాత "నిన్ను పెళ్లి చేసుకుంటాను" అని అతనెప్పుడూ అనలేదు - అయినా, ఆ లక్ష్య సంబంధం వొచ్చినప్పుడు ముఖాముఖీ ఆమెతో మాట్లాడేడు. అందులో తనదే నొబిలిటీ. ఆమె కళ్లనీరు వొచ్చింది నిజమే. కాని, ఆ రెండో



4



5



6

సంబంధం బెడిసిపోవడం, తరవాత తాకక్కడ బేంకులో చేరడం జరిగింది. అమె ఒక్క ఉత్తరం రాసివుంటే పెళ్లి అమె మెడలో తాళికట్టి ఉండేవాడు.

ఇవేళ అమె ఒకడి మూడో భార్య. సవతులిద్దరూ ఒక్కొక్క బిడ్డని అమె పెంపకానికి వదిలిపెట్టారు. అమెకి పిల్లలు లేరు. ఎలా ఉంటారు? ముసిలి మొగుడూ.... మూడో పెళ్లి.

అందుకే తన భుజం తట్టి మరీ పలకరించింది అమెకి తాను కావాలి. యవ్వనం యవ్వనాన్ని వాంఛిస్తుందికదా! అదీగాక పాత ప్రేమికుడు... తనకి ఏమీ తక్కువలేదు. అమె మెచ్చినవాడే. కాకపోతే కాలేజీ సీనియర్ నుంచి చిరుద్యోగి అయాడు

అమె అతనికి– ముసిలాడికి– మూడో భార్య.

అ చిరునవ్వు తనకోసం–అ సెలబ్రేషన్ తనకోసం. అనంద్ కోసం.

అమెకి అందం ఉంది. అది ఎడారి వెన్నెల

అమెకి అస్తి ఉంద కానీ, అది విరుప యోగం.

అమెకి కోరికలున్నాయి. తీరనివి– ఇవేళదాకా.

ఇవేళనించి తానున్నాడు. అనంద్ ప్రేమికుడు.

అలాగే ఆలోచిస్తూ నిద్రపోయాడు. సత్యమూర్తి ఎప్పుడొచ్చారో తెలీదు.

మర్నాటినుంచి అఫీసులో సత్యమూర్తి ధర్మమా అని అతను గొప్ప హీరో అయిపోయాడు. సత్యమూర్తి అవిడ బ్యూటీ, రిచెస్ గురించి ఒక్కొక్కరికి చెప్తో, అనందరావు అదృష్టం గురించి వర్ణిస్తే అందరూ అతన్ని అభినందించసాగారు. "అలా ఉండాలి అదృష్టం అంటే! .. ఎక్కడా వాసన కూడా రాకుండా వ్యవహారం నడిపించావోయ్! మేమూ ఉన్నాం ఏముంది? ఇంటి పనిమనిషి కూడా మా వంక చూడదు" ఇలాగ సాగాయి.

"అప్పే....అదేంలేదు. అ అమ్మాయి నాకు కాలేజీలో జూనియర్. మంచి ఫ్రెండు ...పాపం! ఎమీలేనివాళ్ళింట్లో పుట్టి డబ్బుమాత్రం ఉన్న ముసిలాడిని పెళ్లాడింది.–అంతే" అంటూ. నవ్వుతూ అబద్ధం చెప్తూన్నట్టు తెలిసేలాగ నిజం చెప్పే నటనచేసేవాడు. క్రమంగా అతను మమతకి తాను ప్రియుడిగా పూర్తిగా నమ్మేశాడు. ఒకరోజు అమె స్వయంగా వొచ్చి తనని పిలుచుకుని వెళుతుందని అతనికి తెలుసును. పది రోజులదాకా అతనా నమ్మికతోనే ఎదురు చూశాడు. తానే అక్కడికి వెళితే తన విలువ పోవడమే కాకుండా, జరగాల్సింది జరిగే వీలు పడకపోవచ్చు. తన నిర్లక్ష్యం అమెని ఇంకా రెచ్చగొట్టి రానున్న అనుభవాన్ని ఇంకా గొప్పగా చేస్తుంది

అతను పదిహేనురోజులు ఎదురు చూసి నిరాశచేసుకున్నాడు. ఈ పదిహేను రోజులూ అతను స్వప్నలోకాల్లో విహరించేడు ప్రతిరోజూ తీరిక ఉన్నప్పుడల్లా అతను శృంగారరసం ప్రవహించే కలల నదులలోనూ, ఊహల సముద్రంలోనూ ఆడుకున్నాడు. కాని కలలు కలలుగానూ, ఊహలు ఊహలుగానూ, ఉండిపోయాక అతను టెలిఫోన్ చెయ్యడానికి నిర్ణయించుకున్నాడు. కాని, అది రహస్యంగా చెయ్యాలి. లేకపోతే ఉన్న నిజం తనని రోమాంటిక్ హీరోగా అరాధిస్తోన్న మిత్రులకి తెలిసిపోతుంది.వాళ్ల దృష్టిలో తాను ప్రతివారం ఒకటి రెండుసార్లు అమెని చూస్తున్నాడు. కలుస్తున్నాడు.

అతని టెలిఫోన్ ఎత్తిన కంఠం మర్యాదగా "ఎవరు కావాలండీ?" అని అడిగాడు.

కొంపదీసి. ఈయన అ ముసిలాడేమోనని అనుమానం వచ్చింది.కాని, ధైర్యం చేసి, "మమతగారితో మాట్లాడాలి. నేను అనందరావుని" అని, ఇంకా తన వివరాలు చెప్పేలోపున ఆయన "ఉండండి–కనెక్షన్ ఇస్తాను. అవిడ అఫీసులో ఉంది" అన్నాడు. మరో నిముషం తరవాత "హల్లో" అంది మమత.

"నేను అనంద్ని...."

"హల్లో ఆనంద్?....బాగున్నారా?"

"ఓ యస్. నువ్వెలాగ ఉన్నావు?"

"ఫైన్... "

అ తరువాత ఏమనాలో తెలియలేదతనికి.

"ఊరికినే.... నీ క్షేమ సమాచారాలు తెలుసుకుందామని టెలిఫోన్ చేశాను" అన్నాడు.

"మంచిపని చేశారు. ఒకసారి రాకూడదూ?" అంది మమత.


"వొస్తాను."

"ఎప్పుడు?"


"నువ్వు చెప్పు"

"శనివారం సాయంత్రం రండి.... డిన్నర్ తిని పోదురుగాని."

"అలాగే. ఏడుగంటలకి వొస్తాను."






"గుడ్" అని ఆమె ఫోన్ పెట్టేసింది.

ఆమె శనివారం అనగానే వెంటనే పరేనడం తప్పించింది అతనికి. కొంచెం ఆలోచించి, ఆల్ రైట్ అనాల్సింది. ఈ మధ్య శనివారాలు చేస్తున్నాడొకటి - - కాని, ఒక్కవారం వ్రత భంగంచేసి రాత్రి భోజనం చేస్తే తప్పు లేదు. రెండు చెంపలు వేసుకుంటే ఆ కరుణామయమూర్తి క్షమించి తీరుతాడు.

అతని కలలూ, ఊహలూ మళ్ళీ ప్రారంభమయ్యాయి. శనివారం దాకా ఎలాగో గడిపి, ఏడుగంటలకి ఇంకా పది నిముషాలు ఉండగానే ఆమె ఇంటికి చేరాడు. ఆమె ఒంటరిగా ఉంటుంది. తనని చూడగానే, "ఆనంద్" అంటూ కౌగిలించుకుంటుంది. ఆ ముసలి తనకి ఇవ్వలేనివాటిని తననించి తీసుకుంటుంది. జరగబోయే దంతా అతనికి తెలుసును.

గేటు తీసుకుని మమత ఉంటూన్న పెద్ద బంగళా ఆవరణలో కాలుపెట్టాడు. రెండు అల్సేషియన్లు భీకరంగా మొరగటం మొదలుపెట్టాయి. అతనికి వణుకుడు పుట్టింది. ఇంతలో పక్కన విలబడి బీడీకాలుస్తూన్న ఘూర్కా వొచ్చి వాటిని శాంతింపజేశాడు. ఆ రెండూ గొలుసులతో కట్టిఉన్నాయి. అతని దిగులు తగ్గింది, ఘూర్కా అతన్ని ప్రశ్నలడిగి లోపలికి తీసికెళ్ళాడు, అక్కడ మరో సర్వెంటు అతని పేరు వినగానే, "అమ్మగారు చెప్పేరు... పది నిమిషాల్లో వొస్తారు. కూర్చోండి" అంటూ, పక్కన ఉన్న మరో చిన్న డ్రాయింగ్‌రూంలోకి తీసికెళ్ళి కూర్చోబెట్టాడు. చాలా ఆధునికంగా ఉంది అది. తాను అనుకున్నకన్న ధనవంతురాలు మమత అనుకున్నాడు.

రూమ్‌లో ఒకవేపు చాలా చక్కటి ఆయిల్ పెయింటింగు ఉంది. ఎక్కడిదో, రమ్యమైన ప్రకృతిదృశ్యం అది. దాని కెదురుగా మరో పెయింటింగ్. ఎవరో చాలా ఠీవీగా ఉన్న మనిషిది. అరవై పైన వయస్సు ఉన్నా, గంభీరంగా, మగతనం కొట్టుకొచ్చినట్టు కనిపించే ముఖం.

మమత భర్త అయివుంటాడు.

ఆనందరావుకో ఆలోచన వొచ్చింది. ఈ వృద్ధుకు త్వరగా స్వర్గవాసుడు అయితే, ఆమెను తాను కట్టుకుని, ఉపకారం చెయ్యావొచ్చును. దానికి ఆమె జన్మాంతం కృతజ్ఞురాలిగా ఉంటుంది. ఆ శుభావకాశం త్వరలోనే రావాలని అతను దైవాన్ని ప్రార్థించాడు. అది కాగానే, కొండఎక్కి, తలనీలాలిస్తానని కూడా అనుకున్నాడు.

మమత రాదేం?

బహుశా ఆమె అలంకరణలో నిమగ్నమై ఉంటుంది. ఆమె ఇంక విచ్చలవిడిగా తిరగడం అతనికి నచ్చ లేదు. స్వంతకారులో సినిమాకి ఒంటరిగా పోవడం గౌరవనీయుల విలక్షణం కాదు.... తన కోరిక తీరి ఆమె తన భార్య అయితే....

"ఎక్స్యూజ్ మీ...."

అన్నాడు ఆ యువకుడు. తెల్లగా, సినిమా (యువ) హీరోలందరికన్నా బాగున్నాడు. అందమైన ముఖం, కండలు తిరిగినా, హద్దులు దాటని శరీరం, ఎంతో అందంగా ఉన్న నల్లటి మీసం పాతిక ఉంటుందేమో, వయసు.

"నేను సుధీర్‌ని-మమతగారి సెక్రటరీని.... ఆమె మరో పది నిముషాలలో వొస్తానని చెప్పమన్నారు."

"థేంక్స్" అన్నాడు ఆనందరావు.

"మీకేమైనా కావలిస్తే చెప్పండి.... డ్రింక్ తీసుకుంటారా?"

"నో.... నో...."

"కొంచెం జ్యూస్ పంపుతాను.... టి. వి. చూస్తారా?"

"వొద్దు"

సుధీర్ వెళ్ళిపోయాడు. మరో ఇరవై నిమిషాల తరువాత వొచ్చింది మమత. అని శ్రద్ధగా అలంకరించుకు

న్నట్లు తెలుస్తూనే ఉంది. "సారీ ఆనంద్! వెయిట్ చేయించాను. క్షమించండి" అంది అతని కెదురుగా కూర్చుంటూ.

"నువ్వేం చేసినా సంతోషమే మమతా!" అన్నాడు ఆనందరావు. పెళ్లి కాగానే ఆ సెక్రటరీని డిస్మిస్ చేయించాలని అతననుకున్నాడు.

"థేంక్స్! మీ మనస్సు నాకు తెలుసును" అంది మమత. ఆమె ఏదో, ఇంకా తియ్యటిది చెప్పబోతోందని అనుకున్న ఆనంద్‌కి గదిలోకి వొచ్చిన పిల్లలిద్దరూ ఆశాభంగం కలిగించారు. "మమ్మీ! మమ్మీ!" అంటూ ఆమెని కౌగిలించుకున్నారు. మమత సరేనరి_వాళ్లిద్దరినీ చెరోచేతిలోకి తీసుకుని ముద్దులతో ముంచివేసింది పిల్లలు మూడకుండా కళ్లు తుడుచుకుంట.


"ఇది శ్రీ.... పూర్తి పేరు శ్రీలత, వాడు కిరణ్. నిన్న వీళ్ల డాడీతో కలిసి మహాబలిపురం వెళ్ళేరు. రాత్రికి కాని రారనుకున్నాను" అంది మమత. "అంకుల్ ఆనంద్"ని వాళ్లకి పరిచయం చేస్తూ. ఆమె చివరి మాటలు అతను నోట్ చేసుకున్నాడు.

వాళ్లు అక్కడ సముద్రం గురించీ, బీచ్‌లో ఆడిన ఆటలని గురించీ, చెప్తున్నారు. ఆమె వింటోంది.

"మమతా!...." అంటూ మరొక ఆయన వచ్చాడు.

లేచి నిలబడింది మమత. అతనామెని రెండుచేతుల్లోకి తీసుకుని, "నిన్న అందరం మిస్‌చేశాం.... పిల్లలు సరే సరి. రాత్రి ప్రోగ్రాం కాన్సిల్‌చేసి వచ్చేశాం...." అన్నాడు.

"మంచిపని చేశారు. అమ్మకి ఇవాళే టెంపరేచర్ తగ్గింది. నిన్ననే తగ్గితే వొచ్చేదాన్ని_నా మనసంతా అక్కడే ఉంది...." అంది అతని చేతుల్లో ఒదిగిపోతూ. అతనికి నలభై అయిదు పయిన



ఉండి ఉంటుంది వయసు. గోదమీది బొమ్మ లక్షణాలు ముఖంలో.... బహుశా ఆ చిత్రంలో మనిషికి కొడుకయి ఉంటాడు.

రెండు నిమిషాల తరవాత అతన్ని విడిపించుకుని, అప్పుడే జ్ఞాపకం వొచ్చినట్టు సిగ్గుపడుతూ. "ఈయన ఆనంద్! చెప్పేనుగా!" అంది.

అతను, "నేను శివరామ్‌ని.... మమత మిమ్మల్ని గురించి చెప్పింది. వెరీగ్లాడ్ టు మీట్ యూ!.... ఎప్పుడో రావాల్సింది మీరు. పాత స్నేహితులు కదా" అన్నాడు ఆప్యాయంగా.

"థేంక్యూ! .... మమత షి ఈజ్ ఎ గ్రేట్ వుమన్!" అన్నాడు ఆనందరావు. మరేమనాలో తెలియక.

"పిల్లలూ! వెళ్లి అమ్మమ్మనీ, తాతయ్యని పలకరించండి" అని, వాళ్లని పంపేసి "మీరు నిజం చెప్పేరు.... నాకు కొత్త జీవితాన్ని ఇచ్చింది మా మమత! నా బిజినెస్ ... నా జీవితం.... నా సుఖం అన్నీ ఆమె చేతిలోనే ఉన్నాయి." అన్నాడు.

"చూడండి? గెస్ట్‌స్ వస్తే ఇదేనా మీ మర్యాద? నిన్న పొగుడుతూ కూర్చుంటే ఆయన ఏమనుకుంటాడు? వెళ్లి బట్టలు మార్చుకొని రండి. వాళ్లిద్దరికీ షాంపూ చెయ్యమని చెప్పండి. మహాబలిపురం బీచ్ అంతా వాళ్ల నెత్తినే ఉంది" అంది కోపం చూపుతూ, మమత.

"యస్ డార్లింగ్, మేడమ్" అంటూ అతను మమతకి సేల్యూట్ కొట్టి, ఆనందరావు దగ్గర ఆరు నిమిషాలకి అనుమతి తీసుకుని వెళ్లిపోయాడు.

అచే చూస్తూ నిలబడింది మమత. ఆమె మనస్సుని చదివే ప్రయత్నం చేశాడు ఆనందరావు.

"శివరామ్‌గారు....చాలా మంచిమనిషి ....గ్రేట్ జెంటిల్మేన్" అన్నాడు ఆనందరావు. సుధీర్ అతని మనస్సులో మెదిలాడు.

వెనక్కి తిరిగింది మమత. ఆమె ముఖం వెలిగిపోతోంది.

"ఆయన భగవాన్. ఆనంద్! హి ఈజ్ ఎ గాడ్!" అంది.

బేరర్ రెండు గ్లాసుల్లో జ్యూస్ తెచ్చాడు. అతనికి చేదుగా ఉంది.

"మీ మాటలు చెప్పండి_కిందటిసారి, మనం అస్సలు మాట్లాడుకోలేకపోయాం ....మీ మదర్, ఫాదర్ ఎలా ఉన్నారు?" అంది మమత.

అతనేదో చెప్తున్నాడు. ఆమె దృష్టి ఎక్కడో ఉంది. మరో పదినిముషాలలో శివరామ్ వచ్చాడు. మమత లోపలికి వెళ్లి, ట్రేలో ఏదో డ్రింక్ తెచ్చింది.

"మీ బ్రాంది...." అంది.

అతను వాటి చూసుకుని, "ఎగ్జాక్ట్ టైమ్!" అంటూ డ్రింక్ తీసుకుని ఆమెని తన ప్రక్కన కూర్చోపెట్టుకున్నాడు.

తర్వాత ఏమి సంభాషణ సాగిందో, తనేమన్నాడో, ఆనందరావుకి జ్ఞాపకం లేదు. మమత శివరామ్‌కి రెండవ డ్రింక్ ఇవ్వడం, బేరర్ తనకి మరో గ్లాసు జ్యూస్ ఇవ్వడం, సరిగ్గా ఎనిమిదిన్నరకి భోజనానికి లేవడం. పిల్లలు, అతనూ, మమతా, అందరూ ఎన్నో మాటలాటం_ మాత్రం అతనికి జ్ఞాపకం ఉంది.

తొమ్మిదిన్నరకి ఆనందరావు లేచి, సెలవు తీసుకున్నాడు. అప్పటికే అతని సహనం క్షీణించిపోయింది.

"డ్రైవర్ మిమ్మల్ని డ్రాప్ చేస్తాడు ..." అన్నాడు శివరామ్.

"వొద్దు.... కొంచెం దూరం నడవాలని ఉంది." అన్నాడు ఆనందరావు

"ఎందుకండీ! చీకటి పడిపోయింది..ట్రబుల్ ఏమీ" అంటూ అతన్ని కారెక్కించి, కరచాలనం చేసి వీడ్కోలు చెప్పేడు శివరామ్.

మమత వరండా మీదే నిలబడి చెయ్యి ఊపింది.

ఆనందరావుకి చాలా కోపంగా ఉంది.

"రాస్కెల్" అనుకున్నాడు తనలో తాను.

మమత.... ఆ సుధీర్‌గాడితో అను కుంటూ ఉంటుంది.

శివరామ్ సరేసరి. ఆమెని తన పొగడ్తలతో, ఐశ్వర్యంతో, ప్రేమతో ముంచేసి ఆమె ఆరాధనని అందుకుం టున్నాడు. క్లవర్ రాస్కెల్.

సుధీర్ మాట చెప్పక్కరలేదు. వాడికి ఎంత జీతమో ఇస్తూ ఉంటాడు. రాస్కెల్. అందరూ తాను తప్ప ఎలాగో, తనకి తెలియకుండానే తాను మోసపోయాడు. తనని ఫూల్‌చేశారు వీళ్లంతా.

"ఎక్కడికెళ్లాలి సార్?" అన్నాడు డ్రైవరు.

ఆలోచనలనించి తేరుకుని జవాబు చెప్పేడు.

కాని, ఇప్పుడేంచెయ్యాలి?

దానికి జవాబు రాలేదు. మమత మరీ మరీ జ్ఞాపకం వొస్తోంది. అంతే.

